

చిన్నారులు.. అపర దుర్గలు

హిందూపురం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి సత్యనారాయణపేటలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు దసరా విశిష్టతను వివరిస్తూ అమ్మవారి వేషధారణలో అలరించారు. **- న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్**

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ



స్వామి రథానికి పూజ చేస్తున్న రత్నాకర్ తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో దుర్గాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సాయి కుల్వంత్ మందిరంలో వేద మంత్రోచ్చారణల మధ్య భక్తి గీతాలు ఆలపిస్తూ సత్యసాయి స్వర్ణ రథం, వాహనాలకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ తదితరులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం సాయి నామస్మరణతో మారుమ్రోగింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం ఐదో రోజు వేదపండితులు నిర్వహించారు. సత్యసాయి విద్యార్థులు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఆయుధ పూజ సందర్భంగా భక్తులతో ప్రశాంతి నిలయం కిటకిటలాడింది.

రైతుల సమస్యలపై
ఉన్నతాధికారులకు నివేదిస్తాం

తాడిమర్రి, న్యూస్‌టుడే: అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు నుంచి వెలువడుతున్న కాలుష్యంతో దెబ్బతిన్న పంటలను పరిరక్షించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 'కాలుష్య కోరల్లో పచ్చని పంటలు' అనే శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారి స్పందించారు. దాడితోట గ్రామానికి వెళ్లి రైతుల పంట పొలాలు పరిశీలించారు. పంటలపై పడుతున్న మట్టిపొడి నమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పడుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సేకరించిన నమూనాలను పరిశీలిస్తామన్నారు. సేకరించిన నమూనాలను బనాన రీసెర్చ్ సెంటర్‌కు పంపించి అక్కడి నుంచి వచ్చిన ఫలితం ద్వారా చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరి, స్థానిక వీహెచ్‌ఏ రామాంజనేయులు పాల్గొన్నారు.



అరటితోట పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం

నాడు-నేడు

- ఊసేలేని అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాలు
- వైకాపా ప్రభుత్వ హయాంలో ఆగిన నిర్మాణాలు


అసంపూర్తి!



ఎన్‌పీ కుంట మండలం మండెంవారిపల్లిలో ఆగిపోయిన అంగన్‌వాడీ భవనం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), పుట్టపర్తి, న్యూస్‌టుడే

తల్లీబిడ్డలకు మేలు చేసే ప్రభుత్వం మాది.. అంటూ ఉపన్యాసలతో హోరెత్తించిన మాజీ సీఎం జగన్ తన పాలనలో అంతా తుస్.. అనిపించారు. ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాల నిర్మాణమే నిలువెత్తు సాక్ష్యంగా నిలిచాయి. మూడేళ్ల క్రితం 'నాడు-నేడు' పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేసినా.. నిర్మాణ పురోగతి అతీగతీలేదు. ఒక్కటీ పూర్తి చేయలేని దుస్థితి నెలకొంది. మూడు మాసాల క్రితం తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీ కేంద్రాల పురోగతి, పరిరక్షణకు నడుం బిగించింది. వంద రోజుల పాలనలోనే అనంత జిల్లాకు తాగునీటి, మరుగుదొడ్ల నిర్మాణానికి 1232 పనుల కోసం రూ.3.26 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పనులు ఆరంభమయ్యాయి.



భవనాల స్థితిగతులు ఇలా..

అంశం	అనంత	శ్రీసత్యసాయి
మంజూరైనవి	91	88
పూర్తి అయినవి	00	00
మరమ్మతుల భవనాలు	841	642

శిథిలావస్థలో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పక్కా భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో కనీసం మరమ్మతుకు నోచుకోలేదు. సరికదా.. కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేయలేదు. 2187 అద్దె భవనాలు ఉంటే.. 'నాడు-నేడు' పథకం కింద 2021-22లో కేవలం 171 భవనాలకు మాత్రమే నిధులు మంజూరు అయ్యాయి. అనంత జిల్లాలో 91, శ్రీసత్యసాయి జిల్లాలో 80 ప్రకారం ఉన్నాయి. ఒకో భవన నిర్మానానికి రూ.12.5లక్షలు కేటాయించారు. నిధులు మాత్రం మంజూరు చేయకపోవడంతో చాలా వరకు భవన నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు.

మరమ్మతులు కరవు

కనీసం చిన్నచిన్న మరమ్మతులు సైతం చేయించలేదు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు, ఫర్నీచర్, వంట సామగ్రి.. ఇలా కనీస వసతులు సమకూర్చని దుస్థితి నెలకొంది. 'నాడు-నేడు' రెండో విడత(బీ) కింద ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామంటూ ఉత్తర్వు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1483 పనులకు పరిపాలన ఉత్తర్వు వచ్చింది. అనంత జిల్లాలో 841, శ్రీసత్యసాయి జిల్లాలో 643 ప్రకారం కేటాయించారు. రెండేళ్ల క్రితం కొన్ని పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. ఎక్కడా పూర్తి చేయలేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

- బీఎన్ శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో విడత కింద కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం జరిగింది వాస్తవమే. నిధులు సమస్య తలెత్తడంతో ఒకటీ పూర్తి కాలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరగలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం.

పల్లె పండగ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, అధికారులు

పుట్టపర్తి: ఈనెల 14 నుంచి 20 వరకూ జిల్లాలో జరిగే పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా డ్వామా పీడీ, డీపీవో, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవోలతో సమీక్ష నిర్వహించారు. పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ ఏడాదిలోపు చేసే అభివృద్ధి పనుల వివరాలు తెలిపే బోర్డును ప్రజల అవగాహనకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా వంద శాతం పనులను పూర్తి చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో 32 మండలాల్లోని 436 గ్రామ పంచాయతీల్లో 1,152 పనులకు రూ.78 కోట్లు వెచ్చిస్తామని వివరించారు. కార్యక్రమంలో డీపీవో సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తి.. విద్యాదీప్తి



వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు పుట్టపర్తితో ఎంతో అనుబంధం ఉంది. గతంలో తరచూ శ్రీసత్యసాయిబాబా దర్శనానికి వచ్చి.. ఆశీర్వాదం తీసుకున్నారు. సత్యసాయిబాబా చేపట్టిన విద్యావాహిని ప్రాజెక్టుకు రూ.144 కోట్లు అందించి.. ఎంతో మంది విద్యార్థుల అభ్యున్నతికి దోహదం చేశారు. ఈ ప్రాజెక్టును ప్రశాంతి నిలయంలో బాబా సమక్షంలోనే రతన్‌టాటా ప్రారంభించారు. **- న్యూస్‌టుడే, పుట్టపర్తి**

పుర పీఠానికి ఎత్తుకు పైఎత్తు



హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపల్ పీఠాన్ని చేజిక్కించుకోవడానికి తెదేపా, వైకాపాలు రాజకీయ చదరంగాన్ని ఆడుతున్నాయి. ఒకరిపై ఒకరు ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నారు. మూడున్నరేళ్ల కిందట అధికార బలాన్ని ఉపయోగించుకొని, వైకాపా ఏకపక్షంగా మున్సిపాల్టీని కైవసం చేసుకొంది. 38 స్థానాలున్న పురపాలికలో వైకాపా ఏకంగా 30 చోట్ల గెలవగా తెదేపా 6, భాజపా, ఎంఐఎంలు ఒక్కో చోట గెలుపొందాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో వైకాపాకు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు తెదేపాలో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే అందరిని పార్టీలో చేర్చుకోవడానికి తెదేపా నాయకులు నిరాకరించి కేవలం 11 మందిని మాత్రమే తీసుకొన్నారు. పార్టీలో చేరిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవికి ఆగస్టు 20న రాజీనామా చేశారు. ఆ స్థానంలో తెదేపాకు చెందిన కౌన్సిలర్ రమేష్‌ను ఛైర్మన్ చేయాలని పార్టీ నిర్ణయించింది. రాష్ట్రం అంతా పార్టీ ఘోరంగా ఓడిపోవడం, మెజార్టీ కౌన్సిలర్లు పార్టీని వీడెందుకు, తెదేపాలో చేరేందుకు ఆసక్తి చూపడం, పార్టీకి చెందిన ఛైర్ పర్సన్ తన పదవికే రాజీనామా చేయడంతో, ఛైర్ పర్సన్ స్థానంపై వైకాపా ఆశలు వదులుకొంది. ఇక పోటీలో ఉండకూడదని నిర్ణయించుకుంది.

ప్రకటన ఆలస్యం కావడంతో..

ఛైర్మన్ ఎన్నికకు రెండు నెలలు అవుతున్నా నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో, ఇక్కడ రాజకీయ పరిణామాల్లో మార్పులు చోటు చేసుకొన్నాయి. ఏకంగా వైకాపా అధినేత హిందూపురం కౌన్సిలర్లను పిలిపించుకొని మాట్లాడటం, ఛైర్మన్ ఎన్నికను వదిలేయరాదని, పోటీలో దిగాలని, తెదేపాలో చేరిన కౌన్సిలర్లు, మళ్లీ పార్టీలోకి వచ్చేలా చూడాలని నాయకులకు సూచించడంతో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషాచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త దీపిక‌లు రంగంలోకి దిగారు. తెదేపాలో చేరిన వైకాపా కౌన్సిలర్లు కొందరితో చర్చించారు. వారిలో నలుగురు తిరిగి సొంత పార్టీలోకి చేరేలా చేయడంలో సఫలమయ్యారు. దీంతో మెజార్టీ బలం వైకాపా వైపు మళ్లింది. ఛైర్మన్ ఎన్నిక కోసం భారీగా ఖర్చు చేసేందుకు వైకాపా సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఛైర్మన్ పదవికి పార్టీ తరపున 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిని బరిలోకి దింపడానికి రంగం సిద్ధం చేశారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే తన కార్యాలయ ముఖ్యులతో మాట్లాడారు. వైకాపా సభ్యులు ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లిపోయారు అంటూ ఆరా తీశారు. దీంతో తెదేపా నాయకులు అప్రమత్తమయ్యారు. మున్సిపల్ పీఠాన్ని తప్పనిసరిగా కైవసం చేసుకొనేలా ప్రణాళిక సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా పలువురితో నాయకులు సంప్రదింపులు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సొంత కౌన్సిలర్లతో పాటు పార్టీలో చేరిన కౌన్సిలర్లతో చర్చలు జరిపారు. వైకాపాలో నుంచి మరో నలుగురు పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నట్లు గుర్తించారు. వారిని ఛైర్మన్ ఎన్నిక సమయంలో చేర్చుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

క్యాంపు రాజకీయాలకు సిద్ధం

రెండు పార్టీలు క్యాంప్ రాజకీయాలకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. తమకు మద్దతు ఇస్తున్న వారిని క్యాంప్‌లకు తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు. అయితే వైకాపాలో అంతర్గతంగా విభేదాలు ఎక్కువగా ఉండటంతో పలువురు ఛైర్మన్ ఎన్నికలో తమ పార్టీ పోటీ చేయడాన్ని వ్యతిరేకిస్తుండటం, కొందరు పార్టీని వీడటానికి సిద్ధంగా ఉండటంతో తెదేపా గెలుపు నల్లేరుపై నడకేనని విశ్లేషకులు భావిస్తున్నారు.



పుట్టపర్తిలో టిడ్కో ఇళ్ల సముదాయ దుస్థితి

అందని ద్రాక్షగా పేదల సొంతింటి కల

➤ డిపాజిట్ తిరిగి ఇవ్వాలని లబ్ధిదారుల ప్రదక్షిణ ➤ ఎన్డీఏ ప్రభుత్వంపై ఆశలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంత పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 2018లో తెదేపా ప్రభుత్వం మున్సిపాలిటీ, నగర పంచాయతీల పరిధిలో టిడ్కో గృహ సముదాయాలు నిర్మించాలని సంకల్పించింది. పేదలు తమ కల నెరవేరుతుందనే ఆశతో టిడ్కో గృహాల కోసం శ్రమించి దాచుకున్న సొమ్ము, మరి కొంత మంది అప్పులు చేసి డీడీలు తీసి కట్టారు. లబ్ధిదారులు టిడ్కో భవనాల వద్దకు వెళ్లి జరుగుతున్న పనులు చూసి త్వరలో సొంతింటిలోకి చేరతామని ఆనందపడ్డారు. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ ఐదేళ్లు కాలయాపన చేసిందే తప్ప ఇల్లు ఇవ్వలేదు. తాము చెల్లించిన డీడీల మొత్తమైనా తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం పట్టణాల్లో టిడ్కో గృహాల లబ్ధిదారులు సొంతింటి కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

> హిందూపురం పట్టణానికి చెందిన పాతిమా టిడ్కో ఇల్లు కోసం అప్పు చేసి రూ.50 వేలు డీడీ చెల్లించారు. ఏటా రూ.50 వేలకు రూ.12 వేలు వడ్డీ చెల్లిస్తున్నారు. వైకాపా హయాంలో ఆశతో ఎదురు చూసినా సొంతింటి కల నెరవేరలేదు. కనీసం చెల్లించిన రూ.50 వేలు డిపాజిట్ సొమ్మయినా చెల్లించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడికక్కడే ఆగిపోయి..

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని నిరుపేదలకు టిడ్కో ద్వారా మొత్తం 4,176 ఇళ్లు నిర్మించడానికి తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు రూ.5.96 కోట్లు చెల్లించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం డీడీ నగదు ఇస్తే చాలు అంటున్నారు. మరో వైపు బ్యాంకుల నుంచి రుణం చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అర్హులందరికీ ఇళ్లు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

> సొంతిల్లు వస్తుందని చెబితే పుట్టపర్తికి చెందిన జయశ్రీ డబుల్ బెడ్ రూమ్ ప్లాటుకు రూ.50 వేలు డీడీ చెల్లించారు. మున్సిపాలిటీ అధికారులు ఆమెతో సంతకాలు చేయించుకుని ఏపీజీబీ బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకున్నారు. తీసుకున్న సొమ్ము చెల్లించాలని బ్యాంకు అధికారులు జయశ్రీపై ఒత్తిడి చేస్తున్నారు. అద్దె ఇంట్లోనే జీవితం గడుపుతున్నామని, ప్రభుత్వం చొరవ తీసుకుని ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.

మున్సిపాలిటీలు	లబ్ధిదారులు	డీడీల మొత్తం (రూ.లక్షల్లో)
పుట్టపర్తి	480	48.96
ధర్మవరం	1,440	7.20
హిందూపురం	1,200	233.00
కదిరి	1,104	307.00

ప్రభుత్వానికి నివేదిక అందించాం

- షబీనాభాను టిడ్కో డీఈ

జిల్లాలో టిడ్కో గృహ భవనాల వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. అర్ధాంతరంగా ఆగిన భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించాం. త్వరలో పనులు పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఛైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకో..

కదిరిలో వైకాపా కౌన్సిలర్ల డిమాండు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజిమున్నిసా తన పదవికి రాజీనామా చేయాలని సొంతపార్టీ కౌన్సిలర్లే విన్నవించారు. పట్టణ అభివృద్ధి పట్టకుండా, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న ఛైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవాలని వినతి ఇచ్చినట్లు సమాచారం. వైకాపా కౌన్సిలర్లు తమ పార్టీకి చెందిన ఛైర్‌పర్సన్ రాజీనామాను డిమాండ్ చేసిన లేఖను వాట్సప్ గ్రూపుల ద్వారా బహిర్గతం చేశారు. వినతి పత్రంలోని వివరాలు ఇలా ఉన్నాయి.. ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకుని నాలుగేళ్లలో మూడేళ్లు వైకాపా అధికారంలో ఉంది. అయినా మున్సిపాలిటీలోని ఏవార్డులోనూ అభివృద్ధి జరగలేదు. కౌన్సిలర్లను పట్టించుకోలేదు. పట్టణంలోని 36 వార్డుల్లోని సమస్యలపై దృష్టిపెట్టలేదు. దీంతో ఛైర్‌పర్సన్‌గా మీపై విశ్వాసం లేక ఏడాదిగా కౌన్సిల్‌లోని మెజారిటీ కౌన్సిలర్లు రాజీనామా చేయాలని కోరుతూనే ఉన్నాం. అయినా మీ పద్ధతి ఏమాత్రం మార్చుకోకపోగా కౌన్సిలర్లను కలుపుకొని పోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి కృషి చేయక పోగా ఓటమికి కారణమయ్యారు. తర్వాత తెదేపా అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో వైకాపా అధికారం కోల్పోయి నాలుగు నెలలైంది. కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు, దాడులకు గురవుతున్నా ఏ ఒక్కరినీ పలకరించిన పాపాన పోలేదు. కనీసం మున్సిపల్ కార్యాలయం వైపు రాలేదు. నెలకోసారి జరిగే మున్సిపల్ సమావేశాన్నీ నిర్వహించలేని దుస్థితిలో ఉన్నారు. అందువల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని కోరుతున్నామని 16 మంది కౌన్సిలర్లు వినతి పత్రంలో సంతకాలు చేశారు. ఈ పరిణామాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాల్సిందే.

భూములు తీసుకున్నారు..
పరిహారం మరిచారు

జాతీయ రహదారి 342 నిర్వాసితుల ఆవేదన

గోరంట్ల, న్యూస్‌టుడే: కోడూరు-ముదిగుబ్బ మధ్య నూతనంగా నిర్మాణం, రోడ్డు విస్తరణ సాగుతున్న జాతీయ రహదారి నంబరు 342 కోసం గోరంట్ల మండలంలో ఎంతో మంది రైతుల పొలాలను తీసుకున్నారు. భూ నిర్వాసితులకు సకాలంలో పరిహారం అందివ్వాల్సిన అధికారుల అలసత్వంతో ఏడాదిన్నరగా కార్యాలయాలకు తిప్పుకొంటున్నారు. దీంతో పేదరైతులు ఆవేదన వర్ణనాతీతం. ఏడాదికి పైగా తమను ఇబ్బంది పెడుతున్నారని రైతులు కన్నీరు పెడుతున్నారు.




జాతీయ రహదారి నిర్మాణ పనులు

✦ జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ 2022 సెప్టెంబరులో ప్రారంభమైంది. ఇందులో బుక్కపట్నం నుంచి కోడూరు వరకు రెండోదశగా పనులు ప్రారంభించారు. బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల, చిలమత్తూరు మండలాల పరిధిలో 355 సర్వేనంబర్ల నుంచి 458.32 ఎకరాల భూమి సేకరించారు. నష్టపరిహార అంచనాలు సరిగా రూపొందించలేదని రైతుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఇంకా 30 శాతం మంది రైతులకు పరిహారం అందలేదు.

ఎన్నిసార్లు విన్నవించినా..


భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఏదో ఒక సాకు చెప్పి వెనక్కి పంపుతున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు ఎకరా రూ.కోట్ల విలువ చేసే భూములకు మార్కెట్‌ధర ప్రకారం రూ.లక్షల్లో ఇస్తున్నా రైతులు బాధ పడలేదు. ఆ సొమ్ము ఇవ్వకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. పరిహారం ఇచ్చే వరకు పనులు చేయరాదని పలుమార్లు ఆందోళనలు చేశారు.. పనులను అడ్డుకున్నారు. అయినా న్యాయం జరగలేదని వాపోతున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు



పల్లెవద్ద ఉన్న 14 ఎకరాల భూమి అమ్మి గోరంట్లకు సమీపంలోని గుమ్మయ్యగారిపల్లి కూడలిలో సర్వే నంబరు 58-1లో ఎకరం కొన్నాను. కోడూరు - ముదిగుబ్బ జాతీయ రహదారి 342 నిర్మాణం కోసం ఆ ఎకరా పొలం తీసుకున్నారు. ఏడాదిన్నర నుంచి నిర్మాణ ప్రక్రియ సాగుతున్నా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. గోరంట్ల రెవెన్యూ గ్రామపరిధిలో ఎకరాకు రూ.28లక్షలు నిర్ధారించారు. ఆ పొలం విలువ మార్కెట్‌లో రూ.కోట్లమాటే. ఒకట్రెండు సార్లు పనులను అడ్డుకున్నాం. నాలాంటి వారు ఇంకా ఉన్నారు. **- రమేష్, గోరంట్ల**

విషయం చెప్పరు, వివరణ ఇవ్వరు



నా పొలంలో 75సెంట్లు రహదారి విస్తరణకు తీసుకున్నారు. నాకు రావాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోగా, సరైన సమాధానం చెప్పేవారు లేరు. గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో వినతులు ఇచ్చాను. ఇప్పటికే రెండు నోటిఫికేషన్లు ఇచ్చారు. **- రవీంద్రారెడ్డి, గుంతపల్లి**

వినతులిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం - మారుతి, తహసీల్దార్

ఇటీవలే ఈ మండల బాధ్యతలు తీసుకున్నాను. ఇప్పటివరకు ఒకరైతు మాత్రం పరిహారం అందలేదని వినతి ఇచ్చారు. వెంటనే ఉన్నతాధికారులకు పంపాం. రమేష్ అనే రైతును పిలిపించి మాట్లాడాం. పరిహార జాబితా తయారీ కోసం సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. రైతులు వినతులిస్తే క్షేత్రపరిశీలన చేసి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులకు న్యాయం జరిగే చర్యలు తీసుకుంటాం.

పూర్వ సబ్‌రిజిస్ట్రార్ విధుల నుంచి తొలగింపు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌గా గతంలో పనిచేసిన పీవీ ప్రభాకర్‌ను సర్వీస్ నుంచి తొలగిస్తూ గురువారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ల్యాండ్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆర్‌పీ సిసోడియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో భూముల విలువలు తక్కువ నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేసినట్లు 2006-07, 2007-08 ఆడిటింగ్‌లో బయటపడింది. సబ్‌రిజిస్ట్రార్‌పై అప్పటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించారు. ఈ విషయంపై పీవీ ప్రభాకర్ హైకోర్టును ఆశ్రయించారు. పీవీ ప్రభాకర్‌పై వచ్చిన అభియోగాలు హైకోర్టులోనూ నిర్ధారణ కావడంతో అతడిపై చర్యలు తీసుకోవచ్చని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ప్రభుత్వం పీవీ ప్రభాకర్‌పై చర్యలు చేపట్టింది. నాడు భూముల విలువలు తగ్గించి రిజిస్ట్రేషన్లు చేయడంతో అవినీతికి పాల్పడినట్లు తేలింది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడినట్లు నాటి అధికారులు గుర్తించారు.



శ్రీవారికి అన్నకూటోత్సవ సేవ

గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకొని గురువారం అన్న కూటోత్సవ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 రకాల నైవేద్యాలు సమర్పించి ఉత్సవమూర్తుల వద్ద పులిహోరతో స్వామిని అలంకరణ చేసి పూజలు చూశారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

జీబీసీకి నీరు విడుదల

ఉరవకొండ, న్యూస్‌టుడే: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్(జీబీసీ) అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. కాలువకు 28.5 కిలోమీటరు వద్ద ఈనెల 6న గండి పడిన విషయం తెలిసిందే. మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు అధికారులు గండి పూడ్చారు. ప్రస్తుతం కాలువలో 260 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తోంది. ఆయకట్టులోని పంటలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరాను పునరుద్ధరించడంతో రైతులు ఉపశమనం పొందారు.




కాలువలో నీటి ప్రవాహం

భళా ఆతిథ్యం.. ఏదీ ప్రాతినిథ్యం?

రంజీ జట్టులో జిల్లాకు దక్కని చోటు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: దులీప్ ట్రోఫీ, రంజీ ట్రోఫీ, దివ్యాంగుల జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా ఆతిథ్యం అద్భుతమే. ఇది ఎవరూ కాదనలేని అంశం. రాయలసీమ జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా అనంతలో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్తంగా గ్రామీణ క్రీడాకారులను గుర్తించి సానబెడుతున్నారు. 25 ఏళ్ల నుంచి క్రికెట్ ఎంతో అభివృద్ధి సాధించడానికి ఆర్డీటీ కృషి ఉంది. నిరంతర క్రికెట్ శిక్షణకు ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉప కేంద్రాలు ఉన్నాయి. అనంతపురంతోపాటు గుంతకల్లు, కదిరి, బీకే సముద్రం, బత్తలపల్లి, ధర్మవరం, నార్పల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, హిందూపురం, పెనుకొండ లాంటి ప్రాంతాల్లో క్రికెట్ శిక్షణ శిబిరాలు ఉన్నాయి. రంజీ జట్టుకు ప్రాతినిథ్యం వహించే క్రీడాకారుల సంఖ్య ఈసారి సున్నాకు చేరింది. గత 25 ఏళ్లలో ఎన్నడూ ఇలా జరగలేదు.



అంతర్జాతీయ ప్రమాణాలతో నెట్ సదుపాయం

అందరూ ఆశించినా..

ప్రతి సీజన్‌లో ముగ్గురికి తక్కువగా కాకుండా జిల్లా నుంచి రంజీ జట్టుకు ప్రాతినిథ్యం వహించేవారు. ఇటీవల ఆంధ్ర రంజీ జట్టును ప్రకటించగా అందులో ఒక్కరు కూడా అనంతపురం జిల్లా క్రీడాకారులు లేకపోవడం అందరినీ ఆశ్చర్యంలో పడేసింది. అండర్-23 విభాగంలో ఒక్కరూ ఎంపిక కాకపోవడానికి వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా? అంటూ అనేక మంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆంధ్ర రంజీ జట్టులో డీబీ ప్రశాంత్‌కుమార్, గిరినాథ్ రెడ్డి, షోయబ్, దత్తారెడ్డి ఉన్నారు. సీజన్ ప్రారంభానికి ముందే ముగ్గురిని ఎంపిక చేయగా చివరి రెండు మ్యాచ్‌లకు దత్తారెడ్డిని ఎంపిక చేయడాన్ని కొంతమంది వ్యతిరేకించారు. ఆంధ్ర అండర్-23 విభాగంలో దత్తారెడ్డి, మల్లికార్జున, సంతోష్ గతంలో ఎంపికయ్యారు. ఈసారి దత్తారెడ్డి, మల్లికార్జునలను ఎంపికవుతారని అందరూ అనుకున్నా నిరాశే ఎదురైంది.



అనంతపురం క్రికెట్ మైదానం

రాజకీయ జోక్యంతో..

జిల్లా క్రికెట్ సంఘం, సెలెక్షన్ కమిటీల్లో ఉండే సభ్యుల పిల్లల ప్రతిభ ప్రమాణాలను పట్టించుకోకుండా తుది జట్లకు వారి పిల్లలను ఆడిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. రాజకీయ జోక్యం పెరిగి ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతోందని అకాడమీ ప్రతినిధులు బహిరంగంగా వాపోతున్నారు. క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి కుమారుడిని అండర్-14 జట్టుకు ఉపసారథిగా ఎంపిక చేయడాన్ని ఓ సీనియర్ క్రికెటర్ బహిరంగంగా వ్యతిరేకించారు. ఏ ప్రాతిపదికన ఆ బాలుడిని వైస్ కెప్టెన్ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. క్రికెట్ ఆడుతున్న పిల్లల తల్లిదండ్రులను పదవుల నుంచి తక్షణమే తప్పించాలని పలువురు ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల జిల్లా క్రికెట్ సంఘాన్ని ప్రక్షాళన చేయాలని పలువురు విజ్ఞప్తి చేయడం గమనార్హం.

భూమి.. మార్కెట్ ధర సమీక్షించాలి

జిల్లా సచివాలయం: ప్రస్తుత భూమి మార్కెట్ ధర ఎంత ఉంటుందన్న దానిపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన తర్వాత నిర్ణయించాలని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలు నుంచి వీక్షణ సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్, సంబంధిత సమన్వయ శాఖల అధికారులు సంయుక్త పరిశీలన చేసి.. ప్రస్తుత భూమి మార్కెట్ విలువ ఎంత ఉంటుందో నిర్ణయించాలన్నారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నివేదిక పంపాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ధరలను సమీక్షించాలన్నారు. జిల్లా రిజిస్టర్ భార్గవ్, ఆర్డీఓ వసంతబాబు, ఉద్యాన డీడీ నర్సింగరావు, జడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య, భూ సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

అవసరానికి మించి సెల్‌ఫోన్ వాడకం అనర్థమే

సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్



సర్వజన వైద్యశాల ఎదుట మానవహారంగా వైద్యులు, విద్యార్థులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రస్తుతం సమాజంలో యువత అవసరానికి మించి సెల్‌ఫోన్‌లకే ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో అనర్థాలు జరుగుతున్నాయని అనంతపురం జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైక్రియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్ వీల్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు, వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సర్వజన వైద్యశాల ఎదుట మానవ హారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఎంఎం హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మానవ సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తమకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు కనీసం నలుగురితోనైనా చెప్పుకోవాలని తెలిపారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. పనిచేసే ప్రాంతాల్లో తమ సహచరులతో కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రతి మానసిక సమస్యకు పరిష్కారం ఉందని యువత ఆందోళనకు గురై అఘాయిత్యాలు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం మానసిక ఆరోగ్యం అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. వైద్యులు మురళీకృష్ణ, శ్రీనాథ్, ప్రసూన, మనోరంజన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు పాల్గొన్నారు.

అనంత వైద్య విద్యార్థికి జాతీయ స్థాయి బహుమతి



కేశవరావుకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ మాణిక్యరావు, వైద్యులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: పాండిచ్చేరిలోని శ్రీవెంకటేశ్వర వైద్యకళాశాల మరియు రీసెర్చ్ కేంద్రంలో ఈ నెల 7న జాతీయ స్థాయిలో నిర్వహించిన నిరంతర వైద్య విద్య సదస్సులో అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలో పెథాలజీ విభాగంలో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి డాక్టర్ కేశవరావు పాల్గొని తాను పరిశోధించిన అంశాన్ని వివరించి ప్రథమ బహుమతిని సాధించాడు. గర్భసంచిలో ఏర్పడే సమస్యలను పరిశోధించి అందులో అరుదైన కణితిని గుర్తించాడు. జాతీయస్థాయి సదస్సులో పాల్గొని పోస్టర్ ప్రజెంటేషన్ ఇవ్వటంతో ప్రథమ బహుమతిని దక్కించుకున్నాడు. గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, జ్ఞాపికను ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు.

చింతలరాయుడికి పట్టువస్త్రాల సమర్పణ

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జేసీ దంపతులకు ఘనంగా ఆహ్వానించి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పట్టువస్త్రాలు అందించిన అనంతరం జేసీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిద్దామని వివరించారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



చింతలరాయునికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జేసీ దంపతులు

అనంత జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా ఇలియాస్ బాషా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఏఆర్ అదనపు ఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొందరు డీఎస్పీ నుంచి ఉద్యోగోన్నతి పొంది బదిలీ అవుతుండగా, మరికొందరు ఏఎస్పీలకు స్థాన చలనం కల్పించారు. అనంతపురం జిల్లాకు చిత్తూరులో ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన ఎస్.ఇలియాస్ బాషాను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డిని ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు డీజీపీ కార్యాలయానికి సరెండర్ చేశారు. ప్రస్తుతం అతన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఏఎస్పీగా బదిలీ అయ్యారు. జిల్లాలో డీఎస్పీగా పనిచేస్తున్న జి.మునిరాజు ఉద్యోగోన్నతి పొంది నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వేడుకోలు



ఎమ్మెల్యే అమిలినేనికి విన్నవిస్తున్న బాధితులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసుకొని తమను మోసం చేశారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కళ్యాణదుర్గం ప్రజావేదిక వద్దకు చేరుకొని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో తమ బాధను చెప్పుకొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని 2022లో మమత (మదనపల్లి), అనిత (శ్రీకాకుళం), అవినాష్‌రెడ్డి (తిరుపతి), ఈశ్వర్ (విజయవాడ) విజయవాడకు పిలిపించారు. తమ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు చేశారు. రెండేళ్లుగా వారి చుట్టూ తిరుగుతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదని, డబ్బు తిరిగి ఇవ్వలేదని వాపోయారు. బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి, అప్పులు చేసి రూ.లక్షలు ఇచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన స్పందనలో, 2023 ఏప్రిల్‌లో కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మోసం చేసిన వారందరూ వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అనుచరులు కావడంతో పోలీసులు ఏం చేయలేకపోయారని ఆరోపించారు. అప్పటి నుంచి వారి చుట్టూ తిరిగి వేల రూపాయలు నష్టపోయామని కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన గోపి, వన్నూరస్వామి, ఎర్రిస్వామి, గంగాధర, షాహిదా, తిమ్మారెడ్డి, తిప్పేస్వామి, తిమ్మప్ప, దాసప్ప, విజయశేఖర్, నాగేంద్రప్పతోపాటు 14 మంది బాధితులు ఆవేదన వ్యకం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి ఫోన్ చేసి మాట్లాడారు. మమత, అనితకు మొత్తాన్ని ఇచ్చినట్లు అతడు చెప్పాడు. బాధితులకు నగదు ఎవరిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఎలాంటి సమాధానం రాలేదు. విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

జిల్లా పంచాయతీ అధికారి అక్రమాలపై ఆరా!

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు పారదర్శకం అంటూనే నిబంధనలు తుంగలో తొక్కారు. వైకాపాతో అంటకాగిన అధికారులను అందలమెక్కించారు. నిబంధనలు పాటించిన అధికారులను అడ్డదిడ్డంగా బదిలీలు చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా బదిలీలు చేసిన తర్వాత జిల్లాల వారీగా విచారణలు చేపట్టారు. ప్రస్తుతం అనంతపురం డీపీఓగా వారం రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన టి.నాగరాజు నాయుడుపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎంపీడీఓగా పనిచేసిన నాగరాజునాయుడు గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగడం వల్ల కర్నూలు డీపీఓగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. మళ్లీ డీఎల్‌డీఓగా పదోన్నతి రావడంతో డీపీఓగానే కొనసాగారు. ఇటీవల కర్నూలులో జరిగిన కింది స్థాయి ఉద్యోగుల బదిలీల్లో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న 8 మంది జూనియర్ సహాయకుల బదిలీల్లో నిబంధనలు పాటించలేదు. బదిలీల పేరుతో వారికి పనిచేస్తున్న చోటే డిప్యుటేషన్లు ఇచ్చిన విషయంపై ఆరా తీశారు. వైకాపా హయాంలో ఆయన సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకున్న విషయాలపైనా ఆరా తీశారు. కర్నూలు కలెక్టర్ ఉత్తర్వులను సైతం తప్పుదోవ పట్టించి బదిలీలు ఇష్టారాజ్యంగా చేసినట్లు వెల్లడైంది. కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీలను అక్రమాలకు చిరునామాగా మార్చిన ఆయన్ను మళ్లీ అనంతపురం డీపీఓగా బదిలీ చేయడాన్ని అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు. ఇతన్ని ఎలాగైనా సాగనంపాలని కొందరు పావులు కదిపారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి కర్నూలులో చేసిన అవకతవలపై సరైన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులే కోరుతున్నారు. డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలకు డీపీఓ, డీఎల్‌పీఓలుగా నియమించకూడదని గతంలో హైకోర్టు కూడా ఉత్తర్వులిచ్చింది. పంచాయతీరాజ్ అధికారులు ఈ ఉత్తర్వులను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదోనన్న చర్చకు దారి తీస్తోంది. మరోసారి హైకోర్టును ఆశ్రయించాలని కొందరు డీపీఓలు సిద్ధమయ్యారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశామనే దాడులు

వైకాపా ఉపసర్పంచి ఆరోపణ

యాడికి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశామన్న కారణంతోనే తెదేపా నాయకులు తమ ఇళ్లపైకి దాడులకు పూనుకున్నారని వైకాపా ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, కార్యకర్త బాలిరెడ్డి ఆరోపించారు. గురువారం జరిగిన ఘటనపై వారు యాడికిలో మాట్లాడారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లపైకి వచ్చి దాడులకు పూనుకొన్నారన్నారు. మండలంలో ప్రభుత్వం కేటాయించిన నాలుగు మద్యం దుకాణాలకు తాము దరఖాస్తు చేశామన్నారు. మద్యం దుకాణాలు వారికి ఎక్కడ దక్కకుండా పోతాయోనని, ఇళ్లపైకి 50 మందికి పైగా వచ్చి ఇంటి తాళాలు పగలగొట్టి నానా హంగామా చేశారని, మహిళలను దుర్భాషలాడరని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్‌ను వాహనంలో ఎత్తుకెళ్లారని, పోలీసులకు సమాచారం అందించడంతో విడిచిపెట్టారన్నారు. వైకాపా మండల కన్వీనర్ రమేశ్ వచ్చిన వెంటనే డీఎస్పీ వద్దకు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. దీనిపై తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడిని వివరణ కోరగా దాడుల ఘటనకు సంబంధించి బాధితులు ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు రైతుల దుర్మరణం

పామిడి, న్యూస్‌టుడే: పామిడిలోని అయ్యప్ప గుడి పక్కన 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో శ్రీరంగయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు పామిడిలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన శ్రీరంగయ్య బుధవారం రాత్రి పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా అయ్యప్ప గుడి సమీపంలోకి రాగానే కుక్క అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనలతో కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా గురువారం తెల్లవారుజామున మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రాప్తాడు: రాప్తాడు మండల కేంద్రంలో రోడ్డు దాటుతుండగా జాతీయ రహదారిపై బెంగళూర్ నుంచి యాదగిరి వెళుతున్న కార్ ముందు వెళ్తున్న వారిని ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాప్తాడు ఎస్సై హర్ష తెలిపిన వివరాల మేరకు రాప్తాడుకు చెందిన పోతలయ్య గురువారం సాయంత్రం ఇంటికి వెళ్తూ రోడ్డు దాటే క్రమంలో ఇతడిని కారు ఢీకొని తన ముందు వెళ్తున్న లక్ష్మీనారాయణను ఢీకొనడంతో పోతలయ్య అక్కడికి అక్కడే మృతి చెందగా లక్ష్మీనారాయణను తీవ్రంగా గాయపడ్డాడు. పోతులయ్య (28) రాప్తాడులో వ్యవసాయం, టైలరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. అయ్యవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణను తీవ్రంగా గాయపడటంతో సవేర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతను సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



పోతులయ్య

తాగొచ్చి గొడవ పడుతున్నాడని..

భర్తను హతమార్చిన భార్య



గోవిందు

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మపురి గ్రామంలో గురువారం దేవరకొండ గోవిందు (60)ను భార్య అంజినమ్మ రోకలిబండతో తలపై మోదడంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. గోవిందు వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మద్యం తాగి తరచూ భార్య అంజినమ్మతో గొడవపడేవాడు. వివాహేతర సంబంధం, మద్యం మానేయాలని పలుమార్లు అంజినమ్మ చెప్పినా వినేవాడుకాదు. ఇలాగే గురువారం మధ్యాహ్నం భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత ఇంట్లో నిద్రిస్తుండగా అంజినమ్మ గోవిందు తలపై రోకలి బండతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మవరం గ్రామీణ పోలీసులకు సమాచారం అందడంతో ఇన్‌ఛార్జి సీఐ రెడ్డెప్ప, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అంజినమ్మను అదుపులోకి తీసుకొని గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ పంట దగ్ధం



కాలిపోయిన చీనీ చెట్లు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పెనకచెర్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి చీనీచెట్లు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్లనే చీనీ చెట్ల మధ్యలో ఉన్న ఎండిన గడ్డి అంటుకొని వాటి ద్వారా చెలరేగిన పంటలతో కాయలతో ఉన్న చెట్లు, వ్యవసాయ పరికరాలు సైతం కాలిపోవడంతో సుమారు రూ. 10 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. 9 ఏళ్ల పాటు పెంచిన చీనీ చెట్లు కాయలు బాగా చేతికందే సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో భారీగా నష్టపోయామని రైతు ఆవేదన చెందారు. 1050 చీనీ చెట్లు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

బాలుడిని మింగిన కుంట

వజ్రకరూరు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులతో కలిసి పంట పొలానికి వెళ్లిన బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందాడు. ఈ ఘటన వజ్రకరూరు మండలంలోని జరుట్లరాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, గ్రామస్థుల వివరాల మేరకు.. దస్తగిరి, అమీర్ అన్నదమ్ములు. ఇద్దరు కుటుంబసభ్యులతో కలిసి గురువారం వరి పంటకు మందు కొట్టడానికి వెళ్లారు. దస్తగిరి కుమారుడు అఫ్జల్(09)తోపాటు కుమార్తె, అమీర్ కుమార్తె ఆడుకుంటూ పొలం పక్కనే ఉన్న కుంటలో జారి పడ్డారు. అప్పటికే కుంటలో ఈత కొడుతున్న అమీర్ పిల్లల అరుపులు విని కాపాడేందుకు వచ్చారు. ఇద్దరు ఆడపిల్లలను బయటకు తీశారు. అఫ్జల్ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు రెండు గంటలసేపు కుంటలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కళ్లముందే కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోగొట్టుకున్న నగదు అందజేత

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం దక్షిణ గొల్లహట్టి సమీపంలో గురువారం మధ్యాహ్నం రోడ్డుపై పడివున్న రూ.2.5 లక్షల నగదు అదే గ్రామానికి చెందిన మండల తెదేపా ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నప్పకు దొరికాయి. పెద్ద మొత్తంలో నగదు దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఏఎస్సై రామాంజినేయులుకు అందజేశారు. డబ్బులు దొరికిన విషయం సోషల్ మీడియాలో రావడంతో పోగట్టుకున్న మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నగదు తనదేనని చెప్పారు. చెన్నప్ప చేతుల మీదుగా పోలీసులు నరసింహప్పకు నగదు అందజేశారు. పోలీసులు చెన్నప్పను అభినందించారు.

పాతకక్షలతో ఇరువర్గాల దాడులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని వైఎస్సార్ కూడలి సమీపంలో ఉన్న వీధిలో యువకులు పాతకక్షల కారణంగా పరస్పర దాడులు చేసుకున్నారు. పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం ఆయా వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన రవితేజకు చెందిన దుకాణం వద్ద రెండు నెలల కిందట మనోజ్ అనే యువకుడు మద్యం మత్తులో ఘర్షణ పడ్డాడని తెలిపారు. గురువారం రవితేజ ఇంటిముందు వెళ్తున్న మనోజ్‌ను ఈ విషయంపై నిలదీయడంతో ఇరువర్గాలకు చెందిన యువకులు రాళ్లు, కర్రలతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఇందులో మణికంఠకు గాయలయ్యాయి. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ ఘటనా స్థలానికి చేరకుని సమీక్షించారు. ఇరువర్గాలకు చెందిన మనోజ్, సతీశ్, సాయికృష్ణ, అరవింద, రవితేజ, మరొకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

సీఐ తల్లి హత్య కేసులో నిందితురాలి అరెస్టు



ఎల్లమ్మ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సంచలనం సృష్టించిన ధర్మవరం ఒకటోపట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితురాలిని గురువారం అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గత నెల 28న ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి అదృశ్యం కావడం అనంతరం హత్యకు గురైన విషయం విధితమే. కేసులో మొదటి నిందితుడైన వెంకటేష్ తల్లి బండి ఎల్లమ్మని మదనపల్లె- బెంగళూరు రోడ్డులోని అమూల్ పాలడెయిరీ సమీపంలో అరెస్టు చేసి ఆమె నుంచి రూ.లక్ష నగదు సీజ్ చేశామని తెలిపారు. స్వర్ణకుమారిని వెంకటేష్, అతని స్నేహితుడు అనిల్, ఇతని తల్లి రమాదేవి సుత్తితో కొట్టి చంపేశారు. అనంతరం స్వర్ణకుమారి నగలు తీసుకుని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టి రూ.4.97లక్షలు డబ్బు తీసుకున్నారు. అందులో రూ.1 లక్ష నగదు ఎల్లమ్మ తీసుకుంది. దీంతో ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

చెక్‌బౌన్స్.. ప్రధానోపాధ్యాయురాలికి శిక్ష

పెనుకొండ, న్యూస్‌టుడే: చెక్‌బౌన్సు కేసులో అంజనీలక్ష్మీకళ అనే ఓ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి గురువారం పెనుకొండలోని జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.బుజ్జప్ప 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.13.44లక్షల అపారాధ రుసుం విధించారు. కానిస్టేబుల్ బాబ్‌జాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెనుకొండ మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళతో అంజనీలక్ష్మీకళ అప్పు తీసుకుని ఆమెకు చెక్కు ఇచ్చింది. ఆ చెక్కు బౌన్సు అవడంతో 2022 ఫిబ్రవరి 15న బాధితురాలు కేసు వేసింది. గురువారం ఆ కేసు విచారించిన న్యాయాధికారి ఎం.బుజ్జప్ప శిక్ష విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఒకటిన్నర నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు ఆయన వివరించారు.

హిందూపురం
•హిందూపురం •పెనుకొండ •మడకశిర

తాగునీటి సమస్య పరిష్కరించండి


వ్యవసాయ బోరు వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న కాలనీ ప్రజలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గుడ్డంపల్లి ఎస్సీ కాలనీలో ఐదు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. తాగునీటి బోరు మోటారు చెడిపోవడంతో నీటి కోసం సమీప వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పండుగ పూట తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని సత్వరమే మోటారుకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఈఓఆర్డీ నాగరాజునాయక్ మాట్లాడుతూ స్థానిక సర్పంచితో మాట్లాడి మోటారుకు మరమ్మతు చేయిస్తామని తెలిపారు.

మల్లాపల్లి చెరువు పరిశీలన

గోరంట్ల, న్యూస్‌టుడే: నీటిపారుదలశాఖ ఎస్‌ఈ విశ్వనాథ రెడ్డి గోరంట్ల మండలంలో లీకేజీ అవుతున్న మల్లాపల్లి చెరువును గురువారం పరిశీలించారు. రెండు రోజులుగా డీఈ పర్యవేక్షణలో రైతుల ఆధ్వర్యంలో తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో గురువారం ఎస్‌ఈ చెరువు తూము, కట్ట పరిశీలించి పరిస్థితులపై ఆరాతీశారు. ఈఈ గంగాధర్, డీఈ లక్ష్మీనారాయణ, స్థానిక రైతులు నరేష్ తదితరులు అన్ని విషయాలు వివరించారు.


చెరువుతూము గురించి ఆరాతీస్తున్న ఎస్‌ఈ

ప్రజల వద్దకే ఆధార్ సేవలు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: ప్రజల వద్దకే ఆధార్‌సేవలు నిర్వహిస్తున్నామని హిందూపురం తపాలాశాఖ హెడ్ పోస్టు మాస్టర్ మార్కండేయులు, ఎస్పీ మల్లికార్జునలు తెలిపారు. గురువారం హిందూపురం తపాలాశాఖ ఆధ్వర్యంలో గొరవనహళ్లి బ్రాంచి మిల్లు వద్ద ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలు ఆధార్ కార్డులో ఉన్న తప్పులు, చరవాణి నెంబరు, చిరునామా మార్పు చేయాలన్నా కేంద్రాన్ని సంప్రదించాలని వారు సూచించారు.

డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నాగుపాము

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం ఓ నాగుపాము చొరబడి కలకలం రేపింది. గమనించిన కార్యాలయం సిబ్బంది జాగ్రత్తగా ప్లాస్టిక్ బకెట్‌లో పట్టి పట్టణశివారులో వదిలి పెట్టడంతో పెనుప్రమాదం తప్పింది.

నరసింగానంద్‌పై చర్యలు తీసుకోండి

హిందూపురం, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో యతీ నరసింగానంద్ మొహమ్మద్‌ప్రవక్త, ఖురాన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఆతడిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు గురువారం పట్టణ రెండో పోలీస్ స్టేషన్ సీఐ అబ్దుల్‌కరీంకు ఫిర్యాదు చేశారు. ముస్లిం సంఘాల నాయకులు ఉమర్‌ఫారూక్, వివిధ ప్రజా సంఘాల నాయకులు శివకుమార్, గంగిరెడ్డి, మనోజ్, హనుమంతు, వినోద్‌కుమార్, రామకృష్ణ, రామాంజినేయులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం

హిందూపురం పట్టణం : అన్ని రకాల వర్గాలకు ఉపయోగపడేలా పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో ప్రధాన రహదారి పక్కన నిర్మించిన కన్వెన్షన్ హాల్‌ను సాయి తేజ హీరో మోటార్స్ అధినేత వీఎల్‌ఎం నవీన్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

హిందూపురం: హిందూపురం పట్టణం శ్రీకంఠపురానికి చెందిన సంజీవప్ప(40) బుధవారం రాత్రి పులిమితి రోడ్డులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అతను అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. పట్టణ రెండో పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు..

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని బోయలపల్లితండా సమీపంలోని ఎర్రకొండ ప్రాంతంలో జూదం స్థావరంపై గురువారం దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,03,305ల నగదు, 10 ద్విచక్ర వాహనాలు జప్తు చేసి కేసు నమోదు చేశామని వివరించారు.

చిన్న నీటి వనరులకు మహర్దశ

గత పాలకుల నిర్లక్ష్యమే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో జాప్యం


పూలకుంట చెరువులో పెరిగిన కలువ మొక్కలు

హిందూపురం, మడకశిర, పెనుకొండ, న్యూస్‌టుడే: ఉండిలే మంచి కాలం ముందుముందున అన్నట్లు చెరువులకు కూటమి ప్రభుత్వ పాలనలో మంచి రోజులు రానున్నాయి. సుదీర్ఘకాలం తర్వాత సాగునీటి సంఘాలకు ఏకాభిప్రాయ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలు నవంబరు 16, 17, 18 తేదీలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో సాగునీటి సంఘం ఓటర్లు 6 మంది టీసీ సభ్యులను ఎన్నుకొంటారు. ఈ సభ్యుల్లో ఒకరిని అధ్యక్షుడిగా మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోనున్నారు. తొలుత ఎన్నికలు ఏకాభిప్రాయంతో ప్రయత్నిస్తారు. ఏకాభిప్రాయం కుదరకపోతే చేతులెత్తే పద్ధతి ద్వారా టీసీ సభ్యులను ఎన్నుకొంటారు. అదీ కాకపోతే స్లిప్పుల ద్వారా అభిప్రాయం తీసుకొని ప్రతినిధులను ఎన్నుకొంటారు.

చెరువులు, సాగునీటి సంఘాలు, ఆయకట్టు వివరాలు ..

నియోజకవర్గం	చెరువులు	సాగునీటి సంఘాలు	ఆయకట్టు (ఎకరాల్లో)
హిందూపురం	136	43	15,000
మడకశిర	125	47	16,201
పెనుకొండ	207	59	21,932

బీడుగా ఆయకట్టు భూములు

2015లో సాగునీటి సంఘాలకు అప్పటి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల గడువు వైకాపా పాలనలో ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా పట్టించుకోలేదు. దీనివల్ల చెరువుల బాగోగులు పట్టించుకోలేదు. శ్రీకృష్ణదేవరాయలు, బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ చెరువులు నిన్నటి వరకు ఎంతో పటిష్ఠంగా ఉండేవి. ప్రస్తుతం చెరువుకట్టలు మరమ్మతులు లేక పోవటం ముళ్లచెట్లు పెరగటం, ఎక్కడ చూసినా గండ్లుపడ్డాయి. చెరువుల్లో పూడికలు తీయకపోవటంతో ప్రతి చెరువు పూడిక మట్టితో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. దీనివల్ల ఆయకట్టుకు నీరు చేరటం లేదు. సాగునీటి సంఘాలు ఏర్పాటైతే చెరువులను బాగు చేయటానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చే అవకాశం ఉందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

శుభ సూచకం



- రమేశ్, రైతు, అమిదాలగొంది

ఐదేళ్లుగా చెరువులకు సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయక అభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుతం నిర్వహిస్తుండటంతో చెరువులకు మహర్దశ రానుంది. ముఖ్యంగా చెరువుల్లో కంపచెట్లు తొలగించడం, కట్టలు భద్రం చేయడం, నీటి నిల్వలు పెంచడం వంటివి చేపడతారని ఆశతో ఎదురు చూస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759

సమస్య : పెన్నానదిపై వంతెన పూర్తి చేయండి. **-నాగశేష్, విద్యార్థి**
సమాధానం : పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటాం. **-వెంకటనారాయణ, ఇంజినీరు.**
సమస్య : రొద్దంలో కళాశాలకు వెళ్లే దారి బురదగా మిరింది. **-శంకర్**
సమాధానం : మరమ్మతులు చేయిస్తాం. **-మోహన్, ఇంజనీరు.**
-న్యూస్‌టుడే, రొద్దం

సమస్య: మిట్టమీదపల్లిలో కాలువలు శుభ్రం చేయడంలేదు. **-గంగాధర్**
సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తా. **-భాగ్యలక్ష్మి, సర్పంచి**
సమస్య: ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కందూరి కాంప్లెక్స్ వరకు శుభ్రం చేయలేదు. **-ఆదినారాయణ, వ్యాపారి**
సమాధానం: శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం.
-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్
-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్, గ్రామీణం

సమస్య: గౌడనకుంట ఇందరిమ్మ కాలనీలో కాలువలు ఏర్పాటు చేయాలి. **-సిద్దేశ్వర**
సమాధానం: ప్రతిపాదనలు పంపాం. **-గిరిజమ్మ, సర్పంచి, తమ్మడేపల్లి.**
పరిష్కారం: అమరాపురం మండలం వి.అగ్రహారం బండి ఉగ్రప్ప కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని సర్పంచి రామప్ప దృష్టికి తీసుకెళ్లగా స్పందించి గురువారం మరమ్మతు చేయించారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**
సమస్య: రొళ్లలోని రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-నగేష్**
సమాధానం: కొత్తవాటిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **-రామలక్ష్మమ్మ, సర్పంచి, రొళ్ల. -న్యూస్‌టుడే, రొళ్ల**

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి ప్రజలు తీసుకురావడంతో సంబంధిత అధికారులు, సర్పంచులు స్పందించి వాటికి పరిష్కార మార్గం చూపారు.

స్పందనకు వందనం

● సంతేబిదనూరు పంచాయతీ పరిధిలోని తుంగేపల్లిలో సర్పంచి లలితమ్మ స్పందించి పైపులకు మరమ్మతులు చేయించారు. ●చౌళూరు పంచాయతీ పరిధిలోని వెంకటాపురం నుంచి కారూడిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను గ్రామకార్యదర్శి శ్రీదేవి చొరవతీసుకొని తొలగింపజేశారు.

మడకశిర డిపోను అభివృద్ధి చేస్తాం


బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

మడకశిర, న్యూస్‌టుడే : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కూడలిలో గురువారం మడకశిర నుంచి కర్నూలుకు నూతన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే బస్సును నడిపారు. మడకశిర ఆర్టీసీ డిపోను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డిపో మేనేజర్ రామసుబ్బయ్య, తెదేపా మండల కన్వీనర్‌లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సురేష్, మారుతి, బాబన్న, నాగరాజు, వడ్డెరఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు రతన్‌టాటా : ఎంపీ బీకే

పెనుకొండ, న్యూస్‌టుడే: భారత దేశ పారిశ్రామిక రంగానికి రతన్‌టాటా ఆదర్శంగా నిలిచారని, ఆయన మరణం దేశానికి తీరనిలోటు అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన రతన్‌టాటా చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కొవిడ్ సమయంలో రూ.1500 కోట్ల విరాళం ఇచ్చిన గొప్ప మనసున్న మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్‌లో తెదేపా పట్టణాధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులతో కలసి రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పించారు.


పెనుకొండలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి, పార్టీశ్రేణులు

రాయితీ శనగ విత్తనం పంపిణీ

రొద్దం : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ శనగ విత్తనాలకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారికి అధికారులు పంపిణీని ప్రారంభించారు. కోగిర రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఏవో నివేదిత, తెదేపా సీనియర్ నాయకులు మాధవనాయుడులు బస్తాను అందజేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

గుడిబండ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు గుడిబండ కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజరు మల్లయ్య పేర్కొన్నారు. గుడిబండలో గురువారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. గృహాలు, వాహనాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. మేనేజర్ సాయి సిద్ధార్థ, ఏఎంఆర్‌డీ శాంతిసాగర్, అసిస్టెంట్ మేనేజర్లు సరస్వతీ, మహేంద్ర, ఏఓ వీరనరేశ్, అనిల్, తొలచానాయక్‌లు పాల్గొన్నారు.


చంద్రగిరిలో దుర్గాదేవిగా..


నానెప్పనగర్‌లో..


పరిగిలో రాజేశ్వరీ అలంకరణలో


మహాప్రత్యంగి దేవిగా గంగమ్మ


అలంకరణలో చందకచర్ల గంగమ్మ


మడకశిరలో దుర్గాదేవిగా ఒడుసలమ్మ


రొద్దంలో దుర్గాదేవిగా రేణుకాఎల్లమ్మ...


గోరంట్ల: దుర్గాదేవిగా చౌడేశ్వరీదేవి


సోమందేపల్లి: మహిషాసుర మర్దిని అలంకారంలో చౌడేశ్వరీదేవి

అమ్మవార్లకు విశేష అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. లేపాక్షి, పెనుకొండ, మడకశిరలో దుర్గాదేవి అలంకరణలో, సోమందేపల్లిలో మహిషాసురమర్దినిగా చౌడేశ్వరీ దేవి, మహాలక్ష్మిగా కన్యకా పరమేశ్వరీ, పరిగిలో రాజేశ్వరిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురం పట్టణంలోని కంసలపేటలోని చౌడేశ్వరీ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని ఘనంగా పూజలు జరిపించారు. ఆలయాలను రంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. -న్యూస్‌టుడే బృందం


కనకదుర్గ అమ్మవారిగా రేణుకాయల్లమ్మ


లేపాక్షిలో దుర్గాదేవిగా

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి శ్రీకారం

ఆర్‌డీఎస్ స్కీంతో 24 గంటల విద్యుత్తు సరఫరా

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడేది. లో ఓల్టేజీ సమస్యతో ఇటు గృహ విద్యుత్తు వినియోగదారులు, అటు రైతులు పలు ఇబ్బందిపడే వారు. కరెంటు ఎప్పుడు వస్తోందో, ఎప్పుడు పోతోందనని తెలియని పరిస్థితుల్లో అయోమయానికి గురయ్యేవారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌డీఎస్ పథకం విద్యుత్తు వినియోగదారులకు ఒక వరంగా మారనుంది. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల విద్యుత్తు సరఫరా కోసం ఆర్‌డీఎస్ స్కీం ద్వారా విద్యుత్తు స్తంభాలు, తీగల ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

● పరిగి మండలంలోని యర్రగుంట, తిరుమలదేవరపల్లి, విట్టాపల్లి, చిన్నపల్లి, జంగాలపల్లి, శిరేకోళం, ధనాపురం, పి.నరసాపురం, ఊటుకూరు, ఎస్.బీరేపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలకు విద్యుత్తు వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి సింగిల్ ఫేస్ సరఫరా ఉంది. వ్యవసాయ సర్వీసులకు మాత్రమే త్రీపేజ్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామాల్లో గృహ, చిన్నకుటీర పరిశ్రమలైన పవర్ లూమ్స్, కోళ్ల ఫారాలు, కుట్టు, అగరబత్తీ, పేపర్ ప్లేట్ల తయారీ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనే వారికి 24 గంటల విద్యుత్తు సరఫరా సౌలభ్యంగా ఉంటుంది. మండల వ్యాప్తంగా ఉన్నగ్రామాల్లో విద్యుత్తు లైన్ల ఏర్పాటు పూర్తి అయితే గ్రామాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా ఉంటుంది. ఓ వైపు వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్తు సరఫరాకు ప్రత్యేకంగా విద్యుత్తు సరఫరా వ్యవస్థ ఉంది. మండలంలో పరిగితోపాటు, గొరవనహళ్లి, మణేసముద్రంలో మూడుచోట్ల విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా పైడేటిలో విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటైతే మండలంలో ఎక్కడా విద్యుత్తు కోతలు ఉండవు.


పొక్లెయిన్‌తో విద్యుత్తు స్తంభాలు పాతుతున్న సిబ్బంది

పైడేటిలో ఉప కేంద్రం మంజూరు

మండలంలోని పైడేటి వద్ద విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటుకు అన్ని అనుమతులు వచ్చాయి. ఉప కేంద్రం నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయింది. త్వరలో ప్రజాప్రతినిధుల చేత భూమి పూజ చేయించి పనులు ప్రారంభిస్తాం. పైడేటిలో విద్యుత్తు ఉప కేంద్రం పూర్తయితే పల్లెల్లో ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా ఉంటుంది. పల్లెల్లో 24 గంటల విద్యుత్తు సరఫరా వ్యవస్థ ఏర్పడితే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

-సంజీవప్ప ఏఈ, పరిగి

ఉత్సవాలను విజయవంతం చేయండి

లేపాక్షి, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన లేపాక్షిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయన మాట్లాడుతూ లేపాక్షిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్, పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు, ప్రతాప్, పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న భరతనాట్యం



అలరించిన వివిధ వాయిద్యకారుల సంగీత కచేరి

చిరుత సంచారం.. భయాందోళనలో జనం

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర కొండ నుంచి చిరుతలు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి చిరుత పావగడ రోడ్డు దాటి వెళ్తుండగా కొందరు చూసి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. గతంలో సైతం చిరుతలు పట్టపగలే కొండపై కనిపించగా ప్రజలు భయపడి అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ప్రస్తుతం రోడ్డు పైకి వస్తుండటంతో పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు చిరుత వాహనాలకు అడ్డు వస్తోందని పలువురు వాపోతున్నారు.


పావగడ రోడ్డులో సంచరిస్తున్న చిరుత పులి

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.3.50 లక్షల విరాళం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు పెనుకొండ నియోజకవర్గంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఆర్థిక సాయం అందించారు. గురువారం మంత్రివర్గం అనంతరం మంత్రి సవిత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మొత్తం రూ.3.50 లక్షలు చెక్కును అందజేశారు. వారిలో పెనుకొండ పట్టణానికి చెందిన ప్రగతి, రేవతి, బాబా ఫకృద్దీన్, దాదాపీర్, బాబా, మహిళా గ్రామ సమాఖ్య సభ్యులు రూ.1.50 లక్షలు, బూదిలి గ్రామానికి చెందిన భ్రమరాంబ మహిళా సంఘం సభ్యులు రూ.50 వేలు, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు విశ్రాంతి ఉద్యోగుల సంఘం రూ.లక్ష, పరిగి మండల కేంద్రానికి చెందిన ఇటుక బట్టి యజమానులు రూ.50 వేలు అందించారని మంత్రి సవిత తెలియజేశారు.

వర్షం కురిసి.. కోతకు గురై..



రొళ్ల నుంచి రత్నగిరి వయా కర్ణాటక ప్రాంతం హొసకెర వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైంది. ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని చోదకులు వాపోతున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరు నాగన్నను వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు చేయిస్తామన్నారు. -న్యూస్‌టుడే, రొళ్ల

రోడ్డు వేయడం మరిచారు..

స్థానిక ధనలక్ష్మి రోడ్డులోని ఒక వీధిలో 50 మీటర్ల మేర సిమెంటు రహదారి నిర్మించకుండా వదిలేయడంతో అక్కడ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయింది. ఈ కాలనీలో అన్నివైపులా సిమెంటు రోడ్లు, కాలువలు పదేళ్ల కిందటే నిర్మించినా.. ఇక్కడ మాత్రం నిర్లక్ష్యంతో వదిలేశారని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ అక్కడి పరిస్థితిని పరిశీలించి, పంచాయతీ పాలకవర్గం సమావేశంలో చర్చించి చర్యలు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, సోమందేపల్లి



వాగు కాదండోయ్..!



తురకలాపట్నం వద్ద పెనుకొండ - పావగడ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట గుంతలు కనిపించక కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ విషయంపై సర్పంచి లక్ష్మీదేవిని వివరణ కోరగా రహదారి పక్కనే ఉన్న పట్టాభూములు ఉన్నాయి.. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉంటోంది. సంబంధిత రైతులతో అధికారులు చర్చించి చర్యలు తీసుకునేలా కృషి చేస్తాను. -న్యూస్‌టుడే, రొద్దం

మోరీకి మోక్షమెప్పుడు?



మండలంలోని ఫళారం వీరకెంచమ్మ వంకపై మోరీ శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మోరీ నిర్మాణానికి మోక్షమెప్పుడోనని ప్రయాణికులు, ప్రజలు ప్రశిస్తున్నారు. ఈ మోరీని ఈటీవల ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు సందర్శించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

బాలకార్మికుల గుర్తింపు

గోరంట్ల: బాలకార్మికులకు విముక్తి కలిగించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపరేషన్ స్వేచ్ఛా కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో గోరంట్లలోని పలు దుకాణాల్లో గురువారం దాడులు నిర్వహించారు. 15 మంది బాలకార్మికులను గుర్తించారు. సీఐ శేఖర్, ఎస్సైలు బాబు, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు ఇటుకల బట్టీలు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, గుజిరీ వ్యాపారుల వద్ద ఉన్న బాలకార్మికులను గుర్తించి వారి తల్లితండ్రులకు అప్పగించారు. పిల్లల తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు

పుట్టపర్తి
• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాలు రాక తీవ్ర అనావృష్టితో వ్యవసాయ పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య డిమాండ్‌ చేశారు. గురువారం బత్తలపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుల్లాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ... సంఘం సమావేశంలో మండల వ్యవసాయ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, స్థానిక సీపీఐ కార్యదర్శి వెంకటేశు, నాయకులు ఆదెప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ యానిమేటర్‌ అక్రమాలపై ఫిర్యాదు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం ముత్యాలచెరువు పంచాయతీ పరిధిలోని శ్రీఆంజనేయ గ్రామ సమాఖ్య సంఘం మాజీ యానిమేటర్‌ మహిళా సంఘాల నిధులు దుర్వినియోగం చేసినట్లు సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం వెలుగు సీసీ రవికి ఫిర్యాదు చేశారు. 12 ఏళ్లుగా మహిళా సమాఖ్య యానిమేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి గ్రామ సమాఖ్య సంఘంలో రూ.8 లక్షలు నిధులు దుర్వినియోగం చేశారని తెలిపారు. పుట్టపర్తి పీడీ కార్యాలయంలో రూ.1,83,000 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. మాజీ యానిమేటర్‌ గతంలో మహిళా సంఘాల సభ్యులకు నిధులు దుర్వినియోగం, ఆదాయం వంటి అంశాలను ఎప్పుడూ కూడా సమావేశాల్లో తెలుపలేదు. ద్వారా అధికారులు అతడిపై విచారణ జరిపి నిధుల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టెట్‌లో మార్కులు తక్కువొచ్చాయని.. యువకుడి ఆత్మహత్య

ఓబులదేవరచెరువు: మండల పరిధిలోని గొనిపల్లికి చెందిన జగదీష్‌ (29) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జగదీష్‌ ఇటీవల టెట్‌ పరీక్ష రాశాడు. అందులో నాలుగు మార్కులు తక్కువ వచ్చాయని తెలియడంతో బెంగపెట్టుకుని తన సొంత పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గొర్రెల కాపరి గుర్తించి బంధువులకు చేరవేశాడు. మృతుడి అన్న మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పాముకాటుతో రైతు మృతి

నల్లచెరువు (కదిరి): మండలం రాట్నాలపల్లిలో నివాసముండే విశ్వనాథరెడ్డి (38) పాము కాటుకు గురై మృతి చెందారు. గురువారం బొమ్మిరెడ్డిపల్లికి వెళ్లి పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. గ్రామస్థుల సహకారంతో వైద్యసేవల నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

అమడగూరు: మండలంలోని సుబ్బయ్యానారవ సమీపంలోని మామిడి తోటలో జరిగిన రామలక్ష్మమ్మ హత్యకు సంబంధించిన కేసు విషయమై గురువారం నల్లమాడ ఇన్‌ఛార్జి సీఐ సునిత అమడగూరు స్టేషన్‌కు వచ్చారు. ఆమె మాట్లాడుతూ హత్య కేసు దర్యాప్తులో భాగంగా గురువారం తోటలోకి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. రికార్డుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని వివరించారు.

ఆర్సీపీ నాయకులపై కేసు

కదిరి పట్టణం: ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమిని ఆక్రమించి గుడిసెలు వేయించిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులపై కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. భూమి యజమాని పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలోని సర్వేనంబరు 1780-2, 1778-3, 1778-4, 1778-9లలో 3.81 ఎకరాల భూమిని మూర్తిపల్లి గ్రామస్థుల నుంచి హర్షవర్ధన్ 2018లో కొనుగోలు చేశారు. ఇటీవల ఈ భూమిని ఆక్రమించిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పేదలతో గుడిసెలు వేయించారు. భూమికి సంబంధించిన హద్దులు చెరిపేశారు. తమ భూమిలోకి ఎలా ప్రవేశిస్తారని నిలదీసిన తనను, కుటుంబసభ్యులను కులాలు, పార్టీ పేరుతో బెదిరిస్తున్నారని ఆర్సీపీ నాయకులు నాగన్న, ఇలియాజ్, అరుణ్ మరో నలుగురిపై హర్షవర్ధన్ ఫిర్యాదు చేశారు. భూమి యజమాని ఫిర్యాదు ఆధారంగా ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి వివరించారు.

అందుబాటులో హైబ్రిడ్ విత్తనాలు

కొత్తచెరువు: నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానంలో హైబ్రిడ్ పొద్దుతిరుగుడు, కుసుమ విత్తనం రబీలో సాగుచేసే రైతులకు అందుబాటులో ఉందని శ్రీసత్యసాయి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రిడ్ విత్తనం వివరాలను ఏడీఆర్ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్ 9966665434, 9989625208 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్తంభాలు శిథిలం.. పొంచి ఉన్న ప్రమాదం

మరమ్మతులపై విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం


కదిరి అంబేద్కనగర్‌లో శిథిలమై కూలడానికి సిద్ధంగా..

కదిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదమంటేనే ప్రాణం విలవిల్లాడుతుంది. అలాంటి ప్రమాదం చెంతన ఉందని తెలిసి జీవనం సాగించాలంటే క్షణ క్షణం.. భయం, భయంగా బతకాల్సిందే. అదే పరిస్థితిని పటుచోట్ల పట్టణ, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు శిథిలమై, కొన్నిచోట్ల విరిగిన వేలాడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లపై తీగలు వెళుతున్నాయి. జనావాసాల్లోని కొన్ని నియంత్రికలకు రక్షణ కంచెలు లేక ప్రమాదం పొంచి ఉంది. తమ సమస్యను ఎన్నిసార్లు విద్యుత్తుశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


విరిగిన స్తంభం నుంచి పాఠశాల మీదుగా వెళ్లిన తీగలు

ఐదున్నర దశాబ్దాల నాటిది..

కదిరి పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో విద్యుత్తు స్తంభాన్ని 1969లో ఏర్పాటు చేశారు. దశాబ్దాల కిందట ఏర్పాటు కావటంతో శిథిలావస్థకు చేరుకుంది. స్తంభం పగుళ్లు వచ్చింది. స్తంభం కూలకుండా స్థానికులు నివాసం వైపు సిమెంట్ నిర్మాణం చేశారు. వీధి వైపు స్తంభం సిమెంటు పూత నెర్రలుబారి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. కూలడానికి ఇప్పుడా, అప్పుడా అన్నట్లు ఉంది. నివాసాల మధ్య జనసంచార ప్రదేశంలో ప్రమాదాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల పక్కనే..

నల్లచెరువు మండలం మల్లిరెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల పక్కన విద్యుత్తు స్తంభం విరిగిపోయి వేలాడుతోంది. ఒకే స్తంభానికి కింద, పైనా రెండు వరుసల తీగలు లాగారు. బలమైన గాలులు వీస్తే తీగలు రాసుకున్నా, తెగి కింద పడినా పెను ప్రమాదం పొంచి ఉంది. అంతేగాక విరిగి ఉన్న విద్యుత్తు లైను తీగలు పాఠశాల మీదుగా వెళ్తున్నాయి. తరగతులు ఉన్నప్పుడు ప్రమాదం జరిగితే ప్రాణనష్టం సంభవించే పరిస్థితి ఉంది. స్తంభాన్ని సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

నెలలుగా పరిష్కరించడం లేదు

గ్రామంలోని పాఠశాలకు ఆనుకుని ఏర్పాటైన స్తంభం విరిగి తీగలతో వేలాడుతోంది. ఇప్పటికే నెలలు కావస్తోంది. పిల్లలు ఉన్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం తప్పదు. అంతేగాకుండా తీగలు నేలపడితే గ్రామ ప్రజలకూ ప్రమాదం ఉంటుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.

- బాబ్జాన్, మల్లిరెడ్డిపల్లి

సత్వర చర్యలు చేపడతాం

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాల మార్పునకు తక్షణ చర్యలు చేపడతాం. సిబ్బందికి తగిన సూచనలు ఇస్తాం. ఎక్కడెక్కడ శిథిలమైన, దెబ్బతిన్న స్తంభాలు ఉన్నాయో గుర్తిస్తాం. ప్రజలు కూడా అలాంటి పరిస్థితి ఉన్న విషయాన్ని తెలిపితే తగిన చర్యలు తీసుకుంటాం. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారిస్తాం.

- మోజెస్, విద్యుత్తు డీఈఈ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: కదిరి పట్టణం ఇందిరాకాలనీలో విద్యుత్తు స్తంభం పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలో గాలుల ధాటికి స్తంభం కూలిపోయే ప్రమాదం ఉంది. **- సురేంద్ర, కదిరి**

సమాధానం: దెబ్బతిన్న స్తంభాన్ని పరిశీలిస్తాం. దాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయిస్తాం. **- చెన్నకృష్ణ, విద్యుత్తు ఏఈ**



సమస్య: కదిరి పట్టణం కర్ణాటకవీధిలో తాగునీటి పైపులు పూర్తిగా తుప్పుపట్టి పగిలిపోయాయి. నీరు సరఫరా అయ్యే సమయంలో వీధంతా ప్రవహిస్తూ మురుగుకాలువలో కలుస్తున్నాయి. **- సాంబ, కదిరి**

సమాధానం: దెబ్బతిన్న పైపులు పరిశీలించాలని నీటిసరఫరా విభాగం సిబ్బందిని ఆదేశిస్తాం. అవసరాన్ని బట్టి కొత్తవి ఏర్పాటుచేసి నీరు కలుషితం కాకుండా చూస్తాం. **- విజయ్‌కుమార్, మున్సిపల్ డీఈ, కదిరి**

సమస్య: కదిరి మండలం కౌలేపల్లికాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఇనుపకడ్డీలు రోడ్డుపైనకు వాలి ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- చంద్ర, కదిరి**

సమాధానం: కడ్డీలు దెబ్బతినకుండా దిమ్మెలు ఏర్పాటు చేయాలని పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడికి సూచిస్తాం.
- చెన్నకృష్ణ, ఎంఈఓ, కదిరి - న్యూస్‌టుడే, కదిరి పట్టణం

సమస్య: బసంపల్లి నుంచి మేడాపురం గ్రామం వరకు ఉన్న అనుసంధాన దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. **- మల్లికార్జున, మేడాపురం**

సమాధానం: అంచనా నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.
- అబ్దుల్ ఖాదర్, ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ

సమస్య: సీకేపల్లి కొత్త బీసీ కాలనీలో పంచాయతీ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- శివమ్మ, స్థానికురాలు**

సమాధానం: పంచాయతీ మోటార్లు మరమ్మతులకు గురికావడంతో సమస్య తలెత్తింది. సమస్య పరిష్కరిస్తాం
- శ్యామల, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

పట్టణ సుందరీకరణకు సమష్టిగా కృషి చేద్దాం

ధర్మవరంపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని డ్రైనేజీ కాలువ సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు పారిశుద్ధ్య, తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల సుందరీకరణకు భారీగా నిధులు ఖర్చు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధితశాఖల అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు. ప్రధాన కూడలిలో మరమ్మతులకు గురైన వీధిదీపాలను వెంటనే అమర్చాలన్నారు.


వివిధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

పొదుపుతో భవితకు భరోసా

తనకల్లు, న్యూస్‌టుడే: తపాలా శాఖలో పొదుపు చేసుకోవడం వల్ల భవిష్యత్తుకు భరోసాగా ఉంటుందని ఆ శాఖ ఉద్యోగులు అన్నారు. జాతీయ గ్రామీణ తపాలా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉద్యోగులు గురువారం గోడపత్రాలు ప్రదర్శిస్తూ తనకల్లులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్ మాట్లాడుతూ తపాలా శాఖలో జీవిత బీమా, చిన్న మొత్తాల పొదుపు, ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన, జీపీజీ పాలసీలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తనకల్లు పోస్టుమాస్టర్, జ్యోతికుమార్, ఉద్యోగులు అనిత, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తపాలా ఉద్యోగుల ప్రదర్శన

రెగ్యులర్ ఆర్‌జేడీని నియమించాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ రెగ్యులర్ ఆర్‌జేడీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నియామకం చేపట్టాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఆర్‌జేడీగా విధులు నిర్వహిస్తున్న రవి అక్రమాలకు పాల్పడుతున్నారని, వీటిపై వెంటనే విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నందకిషోర్, హరీష్, సురేష్ పాల్గొన్నారు.

పుడా వైస్‌ఛైర్మన్‌గా జేసీ


అభిషేక్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న పుడా ఉద్యోగులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పుడా ఉద్యోగులు జేసీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పుడా డిప్యూటీ డైరెక్టర్ మల్లయ్య, ఏవో నర్సారెడ్డి, టీపీఏ రేవతి, ప్లానింగ్ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


ముదిగుబ్బలో మహిషాసుర దేవీగా వాసవీమాత


ధర్మవరం పట్టణంలో దుర్గాదేవీ అలంకారంలో చౌడేశ్వరి


తాడిమర్రి: దుర్గాదేవీగా దాడితోట పెద్దమ్మతల్లి


బత్తలపల్లిలో లలితా త్రిపుర సుందరి



తనకల్లు: చౌడేశ్వరికి శాకంబరి అలంకారం


కదిరి పట్టణం: వాసవీదేవికి అలంకరణ

అమ్మా పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజు అమ్మవారు విశేష అలంకరణలతో వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు అమ్మవారిని మనసారా దర్శించుకుని అమ్మా పరమేశ్వరి అఖిలాండేశ్వరి అంటూ ప్రార్థనలు చేశారు. హోమాలు, అర్చనలతో ఆలయాలు శోభిల్లాయి. ఆలయ ప్రాంగణాల్లో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – న్యూస్‌టుడే బృందం


ధర్మవరం: కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్న పరిటాల శ్రీరామ్


కదిరి గ్రామీణం: మహిషాసుర మర్దినిగా మల్లాలమ్మ


పుట్టపర్తి పట్టణం: దుర్గామాత అలంకరణలో సత్యమ్మ


కొత్తచెరువులో దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి


బుక్కపట్నం: దుర్గాదేవిగా వాసవీమాత


పుట్టపర్తి చిత్రావతి నదీతీరంలో విజయదుర్గ


చెన్నేకొత్తపల్లి: న్యామద్దలలో సరస్వతిగా మహేశ్వరి

తెదేపా నాయకుల ఆర్థిక సాయం

కదిరి గ్రామీణం: కదిరి మండలం యర్రదొడ్డి పంచాయతీ పరిధిలోని మీటే నాయక్ తండా గ్రామానికి చెందిన సుధాకర్ నాయక్ అనారోగ్యంతో మరణించారు. మృతుడి కుటుంబ సభ్యులను గురువారం తెదేపా నాయకులు పరామర్శించారు. తెదేపా నాయకుడు ఓంకార్ నాయక్ మృతుడి భార్యకు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

బాధితురాలిని పరామర్శించిన ఆర్డీవో

అమడగూరు: అత్యాచారానికి గురైన బాలికకు ఉన్నత చదువులు, ఆరోగ్య విషయం అన్నింటా అండగా ఉంటాం. అధైర్య పడకండి. . ఏ సమస్య వచ్చినా ఫోన్ చేసి చెప్పాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ బాలిక, తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. గురువారం ఆర్డీవో మండలంలోని బాలిక స్వగ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులతో విచారణ చేశారు. విచారణ అనంతరం తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. తహసీల్దార్ రామనాథరెడ్డి, ఆర్ఐ ఈశ్వరయ్య, వీఆర్వో పవన్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు గంగాదేవి, జమేదారు సూర్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఆధారంగానే పీఎం కిసాన్

కనగానపల్లి,న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్ ఆధారంగానే పీఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమ అవుతుందని మండల వ్యవసాయాధికారిణి కృష్ణకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో పీఎం కిసాన్ నగదు జమ కాని రైతుల వివరాలను పరిశీలించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు విడతల వారీగా ఏడాదికి మూడు సార్లు రైతుల ఖాతాల్లోకి రూ.2 వేల నగదును కేంద్రప్రభుత్వం జమ చేస్తోందన్నారు. 1.2.2019 తారీకులోపు రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు.

రహదారిపై మురుగు శుభ్రం

పుట్టపర్తి, పట్టణం: పట్టణంలోని 9వ వార్డు కర్ణాటనాగేపల్లి సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు గురించి 'పాచిపట్టిన నిర్లక్ష్యం' అనే శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. రోడ్డుపై మురుగును శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

నల్లమాడ: మండల సర్వసభ్య సమావేశానికి ఆర్అండ్‌బీ, రెవెన్యూ, గ్రామీణ నీటిపారుదల, అటవీ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ సునీతాబాయి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం తూతూమంత్రంగా ముగించారు. వివిధశాఖల అధికారులు పనితీరును వివరించారు. వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతున్న సమయంలో ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన ఉలవల్లో అవకతవకలు జరిగాయని వైకాపా సర్పంచులు, ఎంపీటీసీలు అడ్డుకున్నారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు పంచాయతీ సర్పంచులను ఆహ్వానించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి సుమతి మాట్లాడుతూ మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని సమాధానమిచ్చారు.

హ్యాండ్‌బాల్ జట్టుకు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం


రాష్ట్రస్థాయి తృతీయ స్థానం పొందిన జిల్లా జట్టు

కదిరి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లాజట్టు మూడో స్థానం పొందినట్టు జిల్లా కార్యదర్శి మహేష్ తెలిపారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. ఇందులో జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభ చాటా తృతీయ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు.

బాలకార్మిక రహిత సమాజమే లక్ష్యం


గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎస్పీ రత్న, డీఎస్పీ శివనారాయణస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: బాలకార్మిక రహిత సమాజం కోసం కృషి చేద్దామని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా గురువారం కదిరి అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలో బాలకార్మికులు, తల్లిదండ్రులు, దుకాణ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉన్నప్పుడే చక్కటి సమాజం నిర్మాణమవుతుందని అన్నారు. ఈ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పేద, మధ్య తరగతి పిల్లల కోసం ప్రభుత్వం అన్ని వసతులతో విద్యను అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమపిల్లలను విధిగా బడికిపంపాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే భారీమొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కార్మికశాఖ సహాయఅధికారి జహీరుద్దీన్ హెచ్చరించారు. ఈనెల 5 నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి 56 మంది బాలకార్మికులను గుర్తించినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సీఐలు నారాయణరెడ్డి, మోహన్, సమత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. గోడపత్రాలు విడుదల చేసి బాలకార్మికులకు దుస్తులు అందజేశారు.

పనిభారం తగ్గించే వరకు ఉద్యమం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ఆర్టీసీ డిపోలో పెంచిన పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం 5వ రోజు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పెంచిన పనిభారం తగ్గించాలని నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా డీఎం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీ మల్లికార్జున, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు ఎనలేనివి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సత్యమ్మ కూడలిలో రతన్ టాటా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ రతన్ టాటా పారిశ్రామికవేత్తే కాకుండా గొప్ప మానవతావాదని, దేశ ప్రజలకోసం ఎన్నో వందల కోట్ల రూపాయలను ఇచ్చిన మహనీయుడని కొనియాడారు.


రతన్ టాటా చిత్ర పటానికి నివాలులర్పిస్తున్న తెదేపా నాయకులు

చౌడేశ్వరి ఆలయాభివృద్ధికి చేయూత


పూజల్లో కర్ణాటక ఎమ్మెల్యే కిష్టప్ప, సతీమణి గాయత్రి

అమడగూరు, న్యూస్‌టుడే: చల్లని తల్లి చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆశీస్సుల కోసం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయాభివృద్ధికి ప్రధాన భూమిక చేపట్టిన కర్ణాటక భాజపా ఎమ్మెల్యే కిష్టప్ప, ఆయన సతీమణి గాయత్రి పేర్కొన్నారు. అమడగూరులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో రెండ్రోజులుగా జరుగుతున్న అమ్మవారి దసరా ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, మిత్రులు హాజరయ్యారు. కిష్టప్ప మాట్లాడుతూ భక్తులకు మౌలిక వసతులు, వసతి గృహాలు మరికొన్ని నిర్మించాలని సూచించారు. బస్టాండు ప్రాంతంలో పుట్‌పాత్‌ను స్థానికులతో కలసి ప్రారంభించారు. కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సర్పంచి సురేంద్రరెడ్డి, పొట్టా ఉమాదేవి, రాము, కృష్టారెడ్డి, లక్ష్మీనారాయణ, రమేష్, రామిరెడ్డి, పండితులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా విద్యుత్తు స్తంభం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఏర్పాటు చేసిన రహదారిలో నూతనంగా సీసీ రహదారి వేశారు. రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభం ఉన్నా అలాగే వదిలివేసి చుట్టూ రహదారి వేశారు. ఈ రహదారిలో తహసీల్దార్ కార్యాలయానికి ద్విచక్ర వాహనాలు తప్ప, కారులు, ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లడానికి వీలులేకుండా ఉందని, రహదారి వేసినా ప్రయోజనం లేకుండాపోతోందని విమర్శలు గుప్పిస్తున్నారు. విద్యుత్తు స్తంభం పక్కకు మార్చకుండా అలాగే వేయడంపై అభివృద్ధి పనుల్లో ఆటంకాలను చూడకుండా అలాగే వదిలివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అంటున్నారు.

